క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే కైలే ఎన్నికల ప్రచారం

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ నేడు తోట్లవల్లూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలియజేశారు. మండలంలోని యాకమూరు, గరికపర్రు, కుమ్మమూరు, కనకవల్లి గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటిస్తారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని వెంకటేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు.

24న ఏఎన్ఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

గుడివాడటౌన్: స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో ఈనెల 24న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాకు ఏదైనా డిగ్రీ పూర్తిచేసి లేదా ఫైనల్ ఇయర్ స్టూడెంట్, పీజీ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత బయోడేటా, ఆధార్ కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, ఫొటోస్టాట్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 73865 55444, 91820 20936 లను సంప్రదించవలసిందిగా కోరారు.

పోలింగ్ నిర్వహణపై శిక్షణ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. మే 13న జరిగే ఎన్నికలకు సంబంధించి మండలంలోని 38 పోలింగ్ బూత్‌లకుగానూ 148 మంది పోలింగ్ సిబ్బందికి పోలింగ్ నిర్వహణపై శిక్షకుడు బ్రహ్మయ్య అవగాహన కలిగించారు. ఓటరు వివరాలు సరి చూడటం, ఇంకు వేయటం, ఓటరు స్లిప్పు ఇవ్వటం, తీసుకోవటం వంటి పలు అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ కుసుమకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో ఒక్క నామినేషన్ దాఖలు

పామర్రు: పామర్రు అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే ఎన్నికలకు శనివారం ఒక్క నామినేషన్ దాఖలు అయిందని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గ జాతీయ జనసేవ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా సాలె దినేష్‌బాబు ఒక నామినేషన్‌ను దాఖలు చేసినట్టు చెప్పారు.

కాంగ్రెస్ అభ్యర్థికి వామపక్షాల మద్దతు

గుడివాడటౌన్: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వడ్డాది గోవిందరావు(రాజేష్)కు వామపక్షాలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడపాటి ప్రకాష్‌బాబు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి వడ్డాది రాజేష్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

మండవల్లి: మండవల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాదాసీదాగా నిర్వహించారు. పలువురు అధికారులు ప్రగతి నివేదిక వినిపించారు. ఎన్నికల కోడ్ కారణంగా సమావేశం త్వరితగతిన ముగించినట్లు వైస్ ఎంపీపీ ఆదివిష్ణు తెలిపారు. ఎంపీడీఓ ఆర్.బేబీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మండవల్లిలో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం

మండవల్లి: స్థానిక ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి విజయం చేకూర్చాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, జంగం రాందాసు, నాగదాసి థామస్, బేబీ సరోజిని, బుంగా రాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు గౌడ సంఘ ఆత్మీయ సమావేశం

కైకలూరు: నియోజకవర్గ గౌడ సంఘ ఆత్మీయ సమావేశం ఆటపాకలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ నివాసం సమీపంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శనివారం చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాష్ట్ర గౌడ సంఘ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ విచ్చేస్తారని పేర్కొన్నారు.

కాలిగ్రఫీలో ఉచిత శిక్షణ

జుఝవరం(పామర్రు): ఈనెల 24 నుంచి మే 10వ తేదీ వరకు కాలిగ్రఫీపై ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని కాలిగ్రఫీ నిపుణుడు బి.చంద్ర తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎవరైనా ఈ శిక్షణలో పాల్గొనవచ్చని, వివరాలకు 9182200765 ను సంప్రదించాలని కోరారు.

జగనన్న ప్రభుత్వం దేశానికే ఆదర్శం

- గుడివాడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొడాలి నాని
- గుడ్లవల్లేరులో ఎన్నికల ప్రచారం ప్రారంభం
- ఘనస్వాగతం పలికిన ప్రజానీకం



భారీ ర్యాలీగా ప్రచారానికి వెళ్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. గుడ్లవల్లేరులో శనివారం నుంచి ఆయన గడపగడపకు ప్రచారం ప్రారంభించారు. పేదలు పేదలుగానే ఉండాలన్న పెత్తందారీల దోపిడీని అరికట్టేలా పేదల వ్యతిరేక కూటమిని ఓడించేందుకు సీఎం జగన్ చేస్తున్న పోరాటంలో కుల, మత, వర్గ రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే ఐదేళ్లలో మన బతుకులు ఎలా ఉండాలో మన ఓటే నిర్ణయిస్తుందన్నారు. మన బతుకులు మార్చే వారికే ఓటేయాలన్నారు. జగన్ ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలు భవిష్యత్తులో కూడా అందాలంటే దానికి మీ ఓటే ఆయుధమన్నారు. ఫ్యాన్ మీద రెండు ఓట్లు వేస్తే అన్ని పథకాలు ఇంటికే అందుతాయన్నారు. సాధ్యం కాని హామీలతో మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని గుర్తు పెట్టుకోవాలన్నారు.

గజమాలలతో ఘన స్వాగతం

గుడ్లవల్లేరులో ప్రచారానికి వచ్చిన కొడాలి నానికి ప్రజానీకం పూలమాలలు, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతించారు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ర్యాలీగా వచ్చిన ఆయనపై గ్రామస్తులు పూల వర్షం కురిపించారు. తొలుత కొడాలి నాని ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు.



వృద్ధురాలి సమస్య అడిగి తెలుసుకుంటున్న నాని



నానీపై పూల వర్షం కురిపిస్తున్న స్థానికులు

ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, యువజన విభాగం అధ్యక్షుడు గుదే రవి, కేడీసీసీబీ డైరెక్టర్ పడమటి సుజాత, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ పోలగాని రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల బూత్ కన్వీనర్ కోటప్రోలు నాగు, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, ఎంపీటీసీలు ముక్కు సోమేశ్వరరావు, పెనుమాల పూర్ణ కవిత, రంగారావు, మండా దిలీప్‌కుమార్, సర్పంచులు కాలిశెట్టి అర్జునరావు, సాంబయ్య, మోడేపల్లి రవికుమార్, గళ్లా అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



తమ్మలంపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



కురుమద్దాలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తల్లి జ్ఞానమణి

ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్

తమ్మలంపాడు(పెదపారుపూడి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరుగులేని విజయం ఖాయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని తమ్మలంపాడు, దోసపాడు, నాగాపురం, సోమవరప్పాడు, వింజరంపాడు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే కైలే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయటంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ గెలుపు పేదలకు అవసరం

కురుమద్దాలి(పామర్రు): పేదల పక్షాన నిలిచే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం పేదలందరిపై ఉన్నదని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ తల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. మండలంలోని కురుమద్దాలి గ్రామంలో ఎస్సీ, బీసీ, ఎస్టీ కాలనీలలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్ఞానమణి మాట్లాడుతూ శాసనసభ్యుడిగా కైలే అనిల్‌కుమార్‌ను, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యునిగా సింహాద్రి చంద్రశేఖర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు అరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో కైలే సోదరి ప్రచారం

పమిడిముక్కల: స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోదరి కత్తుల అనిత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, ఎస్ఆర్ఐ గుర్విందపల్లి అగ్గిరామయ్య, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాల గురించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి రాంబాబు

పామర్రు: ఈనెల 14వ తేదీన ప్రారంభించిన అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి ఎస్.రాంబాబు మాట్లాడుతూ చిన్న చిన్న తప్పిదాల వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని అప్రమత్తంగా ఉంటే వీటిని నివారించుకోవచ్చునని అన్నారు. ఇళ్లలో గ్యాస్‌లీకై మంటలు రేగినప్పుడు కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తరువాతే అగ్నిప్రమాదాన్ని నివారించే ప్రయత్నం చేయాలన్నారు. ఇంటి నుంచి ఎక్కువ రోజుల పాటు బయటకు వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్ స్విచ్, గ్యాస్ రెగ్యులేటర్లను తప్పనిసరిగా ఆఫ్ చేయాలని సూచించారు. ఆయిల్, పెట్రోల్ తదితర అగ్నిప్రమాదాల నివారణకు బయోకెమికల్ పౌడర్‌ను ఇళ్లల్లో ఉంచుకుని ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు. వంట గదిలో గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులర్ వాల్వ్ కట్టాలన్నారు. గ్యాస్ లీకైనట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపివేయాలి. అటువంటి సమయాల్లో ఎలక్ట్రికల్ స్విచ్‌లు వేయటం, ఆపటం చేయకూడదన్నారు. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయకూడదన్నారు. వంట గదిలో కిరోసిన్, డీసిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లు వంటివి ఉంచకూడదన్నారు. వంట చేసే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటే పరిగెత్తకుండా నేలపై దొర్లాలని సూచించారు. కాలిన శరీర భాగంపై చల్లని నీటిని పోయాలన్నారు. ఈ వారోత్సవాలలో వివరించిన అంశాలను అందరూ జాగ్రత్తగా పాటిస్తే ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి మద్యం విక్రయాలపై చర్యలు



కైకలూరు: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పరిమితికి మించి మద్యం విక్రయాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని ఎన్నికల జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ప్రొహిబిషన్ డిప్యూటీ కలెక్టర్ జీబీఎల్‌పీ ప్రత్యూష అన్నారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో కైకలూరు, ఆచవరం, రాచపట్నం, శోభనాద్రిపురం గ్రామాల్లో మద్యం దుకాణాలను శనివారం ఆమె పరిశీలించారు. రికార్డులతో స్టాకును పోల్చి చూసి తనిఖీ చేశారు. కొనుగోలు చేసినప్పుడు మాత్రమే మద్యం సీసా స్కానింగ్ చేయాలని, ముందుగా చేయవద్దన్నారు. మద్యం దుకాణాల్లోని సిబ్బంది కచ్చితంగా సమయ పాలన పాటించాలని సూచించారు. ఎవరికైనా అదనంగా మద్యం బాక్సులను సరఫరా చేస్తే చర్యలు తప్పవన్నారు. కైకలూరులో ఏ టూ జడ్ ఆక్వా ఫీడ్ దుకాణంలో జీఎస్టీ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో జె.శ్రీనివాసరావు, ఏసీటీవో ఎ.గోపికృష్ణ, ఎస్ఐ కె.శేషారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు వి.గోవర్ధనరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారి కుటుంబానికి రూ. 2 లక్షలు బీమా



కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న పోస్టల్ అధికారులు

గుడివాడటౌన్: గుడివాడ పండ్ల వర్తక సంఘం చిరువ్యాపారులకు అన్ని విషయాలలో అండగా ఉంటుందని సంఘం అధ్యక్షుడు గోకరకొండ బలరామ్ అన్నారు. స్థానిక కొత్తపేటకు చెందిన ఆది మల్లేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సంఘం సభ్యులు, చిరువ్యాపారుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును శనివారం కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెల్ఫేర్ సొసైటీలో ఉన్నవారు తమ పేర్లను నమోదు చేసుకుంటే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ మేనేజర్ గణేష్, గుడివాడ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వి.లక్ష్మీప్రసాద్, పోస్టల్ అధికారులు బీహెచ్ సత్యశ్రీ, ఎన్.శ్రీనివాస్, పండ్ల వర్తక సంఘం నాయకులు పెద్ది రమణ, పెద్ది కిషోర్ పిడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు కైకలూరులో ఎమ్మెల్యే డీఎన్నార్ నామినేషన్



భుజబలపట్నంలో డీఎన్నార్ నామినేషన్‌పై చర్చిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, పార్టీ శ్రేణులు

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రధాన ఘట్టమైన నామినేషన్ దాఖలు కార్యక్రమంలో భాగంగా సోమవారం కైకలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నామినేషన్ సమర్పించనున్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం 8 గంటలకు భారీ ర్యాలీగా తరలివెళ్లి కైకలూరు తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందించనున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రముఖ నాయకులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమానికి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ముంగర నరసింహారావు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ముంగర మల్లికార్జునరావు, ఖాదర్ బాషా, సైదు కామేష్, ఘంటసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయంపై అప్రమత్తత అవసరం



తహసీల్దారు కార్యాలయంలో పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు కీర్తి నారాయణ

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల సిబ్బంది నిశితంగా గమనించాలని నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు పి.కీర్తి నారాయణ చెప్పారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్ఎస్), వీడియో నిఘా బృందాలు(వీఎస్‌టీ)తో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ఫ్లెక్సీల ఏర్పాటు వంటి అంశాల ఖర్చుల లెక్కింపుపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్, షాడ్ రిటర్నింగ్ అధికారి, శిక్షణ కలెక్టర్ శ్రీపూజిత, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్.పోతురాజు, సహాయ వ్యయ పరిశీలకులు జె.శ్రీనివాసరావు, కలిదిండి తహసీల్దారు వంశీ, ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దారు కిరణ్, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ పి.శంకరరెడ్డి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వాటి అవసరత ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్తును కల్పిస్తుందన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రులు అవకాశం ఉన్నంత వరకు కేవలం ఒకే అంశంలో కాక ఇతర అనుబంధ అంశాలపై కూడా శిక్షణ పొందడం అవసరం అన్నారు. ఈ విద్యాసంవత్సరంలో కళాశాల నుంచి 609 మంది విద్యార్థులకు మల్టీ నేషనల్ కంపెనీస్‌లో ఉద్యోగావకాశాలు పొందడం సాంకేతిక విద్యకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగన్ రావాలి



పెదవిరివాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ ఆదాం, మండల నాయకులు

నందివాడ: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు.పెదవిరివాడ గ్రామంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కు మద్దతుగా జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, మండల నాయకులతో కలసి శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోట నాగరాజు, కందుల నాగరాజు, సర్పంచ్ గూడపాటి రజని, వైస్ సర్పంచ్ సుమలత, నాయకులు వెన్న నాగమణి, గుజ్జుల చైతన్య, గూడపాటి ఇస్సాక్, వెన్న నాని, మర్ల పద్మ, గోసాల జోజిమేరి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందని, గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఐదోసారి విజయం సాధించడం ఖాయమని ఎంపీపీ గద్దే పుష్పరాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ అన్నారు. మండలంలోని చిరిచింతల గ్రామంలో ఎమ్మెల్యే కొడాలి నానికి మద్దతుగా మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీకి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కంటే ఈసారి మండలంలో ఎమ్మెల్యే కొడాలి నానికి భారీ మెజార్టీ సాధించేలా పనిచేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, చిరిచింతల, నూజెళ్ల సర్పంచ్‌లు తోట వీరరాఘవయ్య, పఠాన్‌గౌస్, ఎంపీటీసీ సభ్యురాలు సింగవరపు ఝాన్సీరాణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిన్ని సత్యదుర్గాప్రసాద్, సింగవరపు సుబ్బారావు, పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం



పెనుమల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డీఎన్నార్ కోడలు దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత జగనన్నతోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని పెనుమల్లి సచివాలయ పరిధిలో రెండో రోజైన శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు. భాస్కరరావుపేటలో డీఎన్నార్ మరో కోడలు శ్రీఅనుపమ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డీఎన్నార్ భార్య ఇంటింటి ప్రచారం

కైకలూరు: మంచి చేస్తేనే ఓట్లు వేయండి అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ విధంగా పిలుపునిచ్చారో అదే విధంగా సీఎం స్ఫూర్తితో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నియోజకవర్గంలో మంచి పనులు చేసినందున మరోసారి ఆయన్ను ఆశీర్వదించాలని డీఎన్నార్ సతీమణి వీరాకుమారి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలపాడులో శనివారం ఆమె ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి భారీ విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడివి కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు నల్లగచ్చు ధనలక్ష్మి, నాయకులు పడమటి శేషావతారం, సలాది నగేష్, అంబేద్కర్, విజయ్‌కుమార్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీలకు రక్షణ

ముదినేపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీతోనే ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు రక్షణ చేకూరుతుందని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మైనార్టీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు వెంట్రప్రగడ ప్రదీప్ అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో సంధ్య, ప్రదీప్‌తో పాటు పలువురు పాస్టర్లు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతనే మైనార్టీ వర్గాలు ఎంతో ధీమాగా తమ జీవితాలు కొనసాగిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో వీరిపై అనేక దాడులు జరిగాయని గుర్తు చేశారు. క్రిస్టియన్, ముస్లిం మత పెద్దలకు సీఎం జగన్ ప్రతి నెలా గౌరవ వేతనం అందిస్తూ వీరికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. ప్రచారంలో గంటా కోటేశ్వరరావు, తాడంకి రాజేష్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

మండవల్లి: పెరికెగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో నష్టపోయిన బాధిత కుటుంబానికి చెందిన తుమ్మా నరసింహస్వామిని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం కలిసి ఓదార్చారు. పార్టీ సభ్యులు అందరం అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి రాజు, పెరుమాళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీ పెరుమాళ్ల లక్ష్మీకాంతం, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు బి.గోకర్ణయాదవ్, కురెళ్ల ఏసుమరియమ్మ, బావిశెట్టి స్వామి, బేబీ సరోజిని, బుంగా రాణి, శివరామకృష్ణ, కొండారెడ్డి పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల పరిశీలన



కైకలూరు: స్థానిక రైతు బజారులోని 26 దుకాణాల్లో బరువు తూచే యంత్రాలను ఏలూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. విక్రయదారులు కొనుగోలు చేసిన కూరగాయలను అధికారులు తీసుకొచ్చిన తూకం రాళ్లతో సరి తూచి తనిఖీ చేశారు. విక్రయదారుల వద్ద తూనికల లైసెన్సు పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంటు జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్, డెప్యూటీ కంట్రోలర్ బీవీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వి.ప్రశాంత కుమార్, స్థానిక రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ నందిని దేవి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా శివాజీ నామినేషన్

కైకలూరు: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా లావేటి వీర శివాజీ నామినేషన్ పత్రాలను శనివారం తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్‌కు అందించారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ మే 13న నిర్వహించనున్న ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గ ఓటర్లు సింహం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.